# అనగనగా... ఒక కథ

సింగరాజు మేడ అంటే ఓ పెద్ద దివాణంలా ఉంటుంది. నూట పది సంవత్సరాల క్రితం వాళ్ళ తాతగారు కట్టించారు. ముప్ఫై పడక గదులు, చుట్టూ వరండా, రెండు వందల విస్తర్లు లేచే వంటశాల, కాంపౌండ్‌లో ఓ పది సర్వెంటు క్వార్టర్లతో వైభవోపేతంగా ఉంటుంది ఆ బంగళా.

## సింగరాజు బంగళా

సింగరాజు తాతగారి పేరు కూడా సింగరాజే. తండ్రి రామరాజు హయాంలో చుట్టూ ఉన్న మాగాణి పొలాలన్నీ సినిమాలకి పెట్టుబడి కింద నాశనం అయిపోయాయి. ఆరేడు సినిమాలకి నిర్మాతగానూ, ఆ తరువాత ప్రొడక్షన్ మేనేజర్‌గానూ అతని పేరు పడి ఆస్తంతా హారతి కర్పూరంలా దహించుకుపోయింది. అప్పుల ఊబిలో మునిగిపోతున్నప్పుడు...తండ్రి కట్టించిన బంగళా అమ్మేస్తే తెరిపిన పడేవాడేమో లేదా ఇంకో సినిమాకి పెట్టుబడి పెట్టి దివాళా తీసేవాడేమో. బుర్రలో ఆ ఐడియా రాకుండానే మద్రాసులో తను తీసుకున్న ఆఫీసులో ఉరి వేసుకుని చచ్చిపోయాడు. అప్పులు లేవు..ఆస్తులు లేవు. ఈ బంగళా మాత్రం మిగిలింది!

అతనికి సినిమా వ్యసనం.. సినిమా దాహం. ఆస్తంతా హరాయించుకుపోతున్నా తండ్రి కట్టించిన బంగళా మీద కొద్దిపాటి మమకారం. ఇంతో అంతో పరువుకోసం ఆ ఇంటిని అలాగే వదిలిపెట్టాడు. మకాం దాదాపుగా మద్రాసే.

తనూళ్ళో టూరింగ్ టాకీసులో తన పేరు పడే సినిమాలు ఆడుతున్నప్పుడు ఖచ్చితంగా మద్రాసు నుంచి తనూరొచ్చి ఆ టాకీసు దగ్గరకి దర్జాగా కారు వేసుకుని, తిరిగి మహాలక్ష్మి పిక్చర్ ప్రొడక్షన్స్ అని కారు వెనకాల రాసిన అక్షరాలు పాపులర్ చేసుకొనేవాడు.

సొంత ఊళ్ళో ఒక నిర్మాతగా డాబుని ప్రదర్శిస్తూ అవసరం ఉన్న వాళ్ళతోనూ, లేని వాళ్ళతోనూ కారాపి షోగ్గా పలకరిస్తూ, సినిమా వాళ్ళతో...ముఖ్యంగా హీరోయిన్‌లతో తన కున్న పరిచయాల గురించి చిలవలు పలవలు చేసి చెప్పి, త్వరలో ఎన్.టి.ఆర్., జమున, సావిత్రి, నాగేశ్వరావులతో సినిమా ప్లాన్ చేస్తున్నానని డప్పాలు కొట్టేవాడు. మన ఊళ్ళోనే..ఈసారి షూటింగ్ పెడుతున్నానని రెచ్చిపోతూ చెప్పేవాడు. చాటుగా నవ్వుకునే వాళ్ళు నవ్వుకునేవాళ్ళు, ప్రేమగా బాధపడే వాళ్ళు పడేవాళ్ళు. పెదసింగరాజు సంపాదించిన ఆస్తినంతటినీ కోల్పోయావు. కొడుకు కోసం ఈ బంగళా అయినా ఉంచమని మందలించేవారు ఊరి పెద్దలు కొందరు. మెచ్చుకోలుగా మాట్లాడిన వాళ్ళ దగ్గర దర్పం, నీతులు సలహాలు చెప్పేవాళ్ళ దగ్గర కోపంతో 'కోట్లకి పడగలెత్తుతాను' అనే శపథంతో పొగరుగా వెళ్ళేవాడు.

మద్రాసు వెళ్ళిన రామరాజు ఆఖరిసారి దర్జాగా కారులో రాలేదు. ఊరితాడు నుంచి అద్దె టాక్సీలో ఇంటికి చేరాడు- చిన సింగరాజు భోరుమన్నాడు. తండ్రిని ఏమీ తప్పుపట్టలేదు. ఊళ్ళోవాళ్ళు ఎన్ని మాటలు అన్నా పట్టించుకోలేదు.

* * *

చిన సింగరాజుకి మిగిలింది ఆ బంగళానే-

మొన్నీమధ్యన ఒక యువ హీరోతో ఈ ఊళ్ళో సినిమా షూటింగ్ చేయడానికి ముప్ఫైరోజులు, యూనిట్ అందరూ బస చేయడానికి సింగరాజు బంగళా తీసుకున్నారు. ఆ యువహీరో ఆ పల్లెటూళ్ళో అంత హంగులతో సదుపాయంగా కట్టిన బంగళా చూసి దానిమీద మనసుపడ్డాడు.

ప్రొడక్షన్ మేనేజర్‌ని పిలిచి "రోజుకి ఎంత అద్దె ఇస్తున్నావు ఈ బంగళాకి?" అని అడిగాడు.

"ఈ ముప్ఫై రోజులకీ మనకి పదకొండు వేలు అయినట్లు" అన్నాడు మేనేజర్.

ఆశ్చర్యపోయాడు యువహీరో- "ముప్ఫై గదులూ..పది ఔట్ హౌసులకీ కలిపి..నెలకి..పదకొండు వేలేనా? ఇది వాడి తెలివితక్కువ తనమా, నీ తెలివి తేటలా?" అని అడిగాడు హీరో.

"ఓనర్ అసలు అద్దె వద్దన్నాడు సార్! నేను ఇల్లు కడిగించి బూజు దులిపించి వెల్లలు వేయించుకోడానికి పదకొండు వేలు ఖర్చు అయింది అంతే- అదీ మెటీరియల్ కొనటానికే. పనంతా ఓనరే స్వయంగా చేసుకున్నాడు-సర్వీసు ఛార్జీ కూడా తీసుకోకుండా"

"ఏంటట ప్రాబ్లం స్క్రూ లూజా? సినిమా క్రేజా?"

"కాదు సార్..మమకారం..ఈ ఇంటిమీద మమకారం"

అర్థం కానట్లు చూసాడు హీరో.

"సున్నం వేస్తున్నప్పుడు..బూజు దులుపుతూన్నప్పుడు గోడలమీదా నేల మీదా బ్రష్షులూ చీపుళ్ళూ వాడటానికే గిలగిల్లాడిపోయేవాడు. ఓపిక లేదుగానీ ఇల్లంతా నోటితో ఊది శుభ్రపరిచే రకం" నవ్వుతూ చెప్పాడు మేనేజర్.

"నేను అతన్ని చూసానా" వండరౌతూ అడిగాడు హీరో.

"భలే వారే సార్. రోజూ మిమ్మల్ని నిద్రలేపి రూమ్‌క్లీన్ చేసి వెళ్లిపోతాడే..ఆయనే..ఆయనే ఓనరు"

"ఎవరు? ఆ ముసలాయనా?" అంటూ యువ హీరో షాక్ అయ్యాడు.

నిజంగానే "చీపురు పెట్టి తుడవాల్సిన చోట భుజంపై తువ్వాలు తీసి తుడవటం, చేతుల్తో అద్దాలు శుభ్రపరటం చూసి ఓవర్ ఏక్షన్‌గాడు అనుకున్నాను నేను" అన్నాడు.

"ఓవర్ ఏక్షన్ కాదు సార్..ఓవర్ ఎఫెక్షన్..ఈ ఇల్లు అతని వళ్లు లాంటిదని ఫీలవుతాడు"

"అయితే..అతనితో ఓసారి మాట్లాడాలి"

**"సింగరాజుగారూ మీ సెంటిమెంట్ నాకు మీ ఇంటికన్నా నచ్చింది. మీ ఆర్థిక పరిస్థితి నాకు తెల్సు. నేను మీ యిల్లు కొనను. కొన్నా నాది అనను. మిమ్మల్ని ఖాళీ చెయ్యమనను. కానీ..మీ తర్వాత ఈ బంగళాని ఏం చేయదల్చుకున్నారో చెప్పండి. నేను ఏం చేయాలో ఆలోచించుకుంటాను" మొహమాటపడుతూ అన్నాడు హీరో.**

"దేనికి సార్?"

"ప్లీజ్ అతన్ని పిలు"

★ ★ ★



యాభై..అరవై..డెబ్భై లక్షలు..ఇస్తానన్నా ఆ బంగ్లా అమ్మనన్నాడు సింగరాజు.

"నేనీ ఇల్లు కూల్చను. దీని షేపు మార్చను..ఈ బంగళా ఇలాగే ఉంచుకుంటాను. ఇలాగే మెయిన్‌టైన్ చేస్తాను. ఇది నాది అనిపించుకోవాలని నా కోరిక" ప్రాధేయపడుతూ అడిగాడు హీరో.

"బాబూ..నా ఇల్లు మీకింత నచ్చినందుకు సంతోషం- ఈ ఇల్లు మామూలు ఇల్లు కాదు. పూటకి వందమంది అన్నం తిన్న స్థలం ఇది..ఇప్పుడు నేనూ మా ఆవిడా ఇద్దరమే! తను వారానికి ఏడు గదులు చొప్పున పొద్దుణ్నించి సాయంత్రం వరకూ శుభ్రం చేస్తుంది. మేము ఎవరికీ అద్దెకివ్వం- అమ్మం..అద్దెకి తీసుకున్నవాళ్లు 'ఇది మా వాటా' అనుకున్నా మేం భరించలేం..నేను పగలంతా మునసబుగారి రొయ్యల చెరువుకి కాపలాకి వెళ్తాను..ఆయనిచ్చే జీతం డబ్బుల్తో కలో గంజో తాగి పడుకుంటాం. మీకు తెల్సా మేం రోజుకో గదిలో ఉంటాం. ఇల్లంతనీ మా దుప్పట్లో కప్పుకున్నట్లు...మా చేతుల్తో కావలించుకున్నట్లు తృప్తిగా పడుకుంటాం. ఇప్పుడిలా మీ షూటింగనీ ఇంట్లో ఇంతమంది గుమికూడతారని చెప్పినప్పుడు మా తాతలనాటి కలకలం కనిపిస్తుందనీ..కోలాహలం వినిపిస్తుందనీ మీరిక్కడుంటానంటే వప్పుకున్నాను. మీ దయవల్ల మళ్లీ మా ఇంటికి రంగులొచ్చాయి. అన్ని గదుల్లోనూ దీపాలు వెలిగాయి. నా కష్టార్జితంతో నేనెప్పటికీ ఈ బంగ్లాకి ఈ కళ తేలేను. అంతా తాతగారి దయ"

సింగరాజు చెప్తున్న మాటలు యువహీరో చాలా ఆర్ద్రంగా విన్నాడు.

"సింగరాజుగారూ మీ సెంటిమెంట్ నాకు మీ ఇంటికన్నా నచ్చింది. మీ ఆర్థిక పరిస్థితి నాకు తెల్సు. నేను మీ యిల్లు కొనను. కొన్నా నాది అనను. మిమ్మల్ని ఖాళీ చెయ్యమనను. కానీ..మీ తర్వాత ఈ బంగళాని ఏం చేయదల్చుకున్నారో చెప్పండి. నేను ఏం చేయాలో ఆలోచించుకుంటాను" మొహమాటపడుతూ అన్నాడు హీరో.

సింగరాజు చాలా సేపు మాట్లాడలేకపోయాడు.

నెమ్మదిగా గొంతు సవరించుకుని "ఈ బంగళా నాది కాదు బాబూ..మా నాన్నది కూడా కాదు. మా తాతగారిది" గొంతు గద్గదమౌతోంది.

"మీరు చెప్పింది నాకు అర్థమైంది. కానీ ఒక్క మాట చెప్తాను. మీ ఇంటికి మీరే యజమాని..ఇదెప్పటికీ సింగరాజు బంగళాగానే వుంటుంది. మీ తర్వాత నేను కూడా ఇలాగే ఉంచుతాను. నేను మీకు కోటి రూపాయలు ఇస్తాను. ఆ డబ్బుతో పదిమందితో కల్సి తినటానికి వాసయోగ్యంగా ఉంచుకోండి. మీ తృప్తికోసం అందరికీ అన్నం పెట్టుకోండి-మీ తాతగారి నాటి వైభవం ఉంచుకోండి-"

సింగరాజు ఏం మాట్లాడలేకపోయాడు.

కళ్ళల్లో నీళ్లు పొంగాయి. రెండు చేతులూ జోడించాడు- హీరో మాటల్లో స్వార్థం లేని నిజాయితీని గమనించాడు. తను పోయినా తన తాతగారి బంగ్లా నిలబెడతానన్న అతని మాటకి పులకించిపోయాడు. నెమ్మదిగా కూడబలుక్కున్నట్లు "కానీ...బాబూ..నేనో మా ఆవిడో ఎవరు ముందు పోయినా..రెండోవాళ్ళు పోయేదాకా మీకీ బంగ్లా అప్పజెప్పలేము. అందుకు అభ్యంతరం లేకపోతే..మీరిస్తానన్న సొమ్ము బ్యాంకులో వెయ్యండి..ఆ వడ్డీ డబ్బుల్తో మా బంగళా సందడిగా వుంచుతాం..మేం పోయాక ఆ సొమ్ము కూడా మీదే...మా తాతగారి పేరు మీదే ఈ బంగళా ఉంటుందంటున్నారు. నాకంతకన్నా కావాల్సింది ఏం లేదు"

వారం తర్వాత రాతకోతలయ్యాయి..బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేశాడు హీరో.

ఇది జరిగి 20 ఏళ్లు అయింది. చినసింగరాజుకి 70 ఏళ్లు దాటాయి. భార్య కూడా గతించింది. సింగరాజు మాత్రం నౌకర్లనీ చాకర్లనీ పెట్టి తన భవనాన్ని కాపాడుకుంటున్నాడు...కాదు తన ఇంటికి తనే వాచ్‌మేన్‌గా ఉంటున్నాడు. ఆ ఊరొచ్చిన కొత్తవాళ్లకీ ఊరూ పేరూ లేని ఊళ్లోవాళ్లకి ఆత్మీయంగా అన్నం పెడుతున్నాడు. ఏడాదికో పది రోజులు హీరో కూడా వచ్చి సింగరాజు బంగళాలో భోజనం చేసి వెళ్తుంటాడు..అదీ గెస్టుగానే.

*